మనీషి

- పి.చంద్రశేఖర అజాద్

(1991 ఏప్రిల్ నెల చతుర నుంచి రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)

(గత సంచిక తరువాయి)

సాంబశివరావు మెట్లు దిగి హాల్లోకి వచ్చాడు.

అందరూ దిగాలుగా కూర్చుని ఉన్నారు. ఎవరూ మాట్లాడుకోవటంలేదు. అక్కడ నిశ్శబ్దం కూడా దిగులుగానే ఉన్నట్లు అనిపించింది.

భూషయ్యగారు మాత్రం ప్రశాంతంగా నిద్రపోతున్నట్లుగా ఉంది. ఆ నిద్రలో ఏవేవో లోకాల్ని దర్శిస్తున్నట్లుగా కనిపిస్తున్నాడు.

"అయ్యగారూ" అన్నాడు పనిమనిషి

ఆలోచిస్తున్నదల్లా ఉలిక్కిపడింది.

"ఏమిటి వాళ్ళను కూడా అలానే కూర్చోపెట్టావు?" అన్నాడు.

ఆమె అయోమయంగా చూసింది.

"ముందు వాళ్ళకోసం ఏమైనా వండు. తెల్లారిలేస్తే పనులు చేస్తారు"

"అదేంటయ్యగారూ పెద్దాయన్ని ఇక్కడ పెట్టుకుని ముద్దెట్టా లోపలికి పోద్ది?"

"దాందేముంది? మీరందరూ తనకోసం భోజనం మానుకున్నారని తెలిస్తే ఆయన చాలా బాధపడతాడు. ముందు మీరందరూ భోజనాలు చేయండి"

"ఓ పూట తినకపోతే పానాలు పోవులే బాబూ. దేవుడిలాంటి మడిసి ఎల్లిపోయాక" అన్నారు.

వారి మాటల్లో ఎలాంటి కృత్రిమత్వం లేదు. తమ యజమానిని సంతోషానికి గురిచేయాలనే తలంపూ లేదు. హృదయం నుండి దూసుకువచ్చాయా మాటలు.

"సులోచనా.. ముందా పని చూడు. అర్జెంటుగా బయలుదేరాల్సి ఉంటుంది. మరలా ఇదంతా కుదరకపోవచ్చు"

"అలాగే"

సాంబశివరావు మెల్లగా నడుచుకుంటూ ఓ చోటికి వెళ్ళి ఆగిపోయాడు. అది తాను అమితంగా ప్రేమించిన తన తండ్రీ. తమను విడిచి వెళ్ళిన తమ చిన్నారి భూపేష్‌ల ఫోటో.

ఇప్పటివరకూ ఆ ఫోటోలో ఓ వ్యక్తి తమ కళ్ళముందున్నాడనే తృప్తి ఉండేది. ఇప్పుడా ఇద్దరూ లేరు.

వారింక స్మృతులుగానే మిగిలిపోతారు. కొన్ని లోట్లు పూడ్చుకోవటం సాధ్యంకాదు. ఇదీ అంతే.

తనకింక తండ్రీలేడు. తనకెప్పటినుండో కొడుకూ లేడు.

''ఇలారా''

పనిమనిషి పరుగు పరుగున వచ్చింది.

''ఈ పటం నా గదికి తీసుకురా'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆమె గోడనున్న పటం జాగ్రత్తగా కిందకు దించింది. గబగబా లోనికి వెళ్ళి తడిగుడ్డ తీసుకువచ్చి అద్దం మీదున్న మట్టిని తుడిచింది. తళతళా మెరుస్తూంది.

తాతా మనవడి కళ్ళలో ఎంత ఉత్సాహమో..

ఆ ఫోటోలో భూషయ్యగారు ప్రత్యేకంగా కనిపిస్తున్నారు.

అవును మరి..

ఆయన తన మనవడితోపాటు అద్భుతంగా అమరిన లాల్చీ వేసుకున్నారు.

లాల్చీలో గంభీరంగా కనిపిస్తున్న భూషయ్యగారూ.

ఆయన్తోపాటు భూపేష్.

సజీవ చిత్రం అది.

లేని మనుషుల్ని ఎప్పుడూ కళ్ళముందు నిలిపే అపురూప చిత్రం అది.

అప్పటివరకూ అణుచుకుంటున్న ఉద్వేగతరంగాల్ని భరించటం ఇంకేమాత్రం ఆయనకు సాధ్యంకాలేదు.

ఆ పటాన్ని తన హృదయానికి హత్తుకుని నిశ్శబ్దంగా రోదించాలనుకున్నాడు.

తనవల్ల కాలేదు.

నోటినుండి చిన్న మూలుగుగా ఆరంభమైన ఆవేదన పెను దుఃఖంగా మార్పు చెందింది.

ఇంక తనను తాను నిరోధించుకోవటం అసాధ్యంకాగా దిండులో తలదూర్చి రోదిస్తున్నాడు. ఆ దిండు అలా తడుస్తూనే ఉంది.

సాంబయ్య తన ఊరునుండి పక్క ఊరికి చదువుకోవటానికి వెళ్ళిన రోజులన్నీ జీవితంలో మరుపురాని జ్ఞాపకాలే.

తనతోపాటు తమ ఊరి పిల్లలు మరికొందరు నడిచివచ్చేవారు. దారిపొడుగునా కబుర్లే. కొంతమంది మాత్రం అప్పుడప్పుడూ బడిమానేసి సినిమాలకు వెళ్తుండేవారు. తను మాత్రం ఎప్పుడూ అలా చేసేవాడు కాదు. ముందు తన అమ్మనూ, నాన్ననూ మోసం చేయటం అనే భావన అసలు నచ్చేదికాదు. అంతగా సినిమాలూ చూడాలని వుంటే ముందుగా అమ్మతో చెప్పి ఆ తర్వాత డబ్బులు తీసుకుని వెళ్ళేవాడు.

సాంబయ్యకు జీవితంలో ఓ కోరిక ఉండేది. అది తన నాన్ననుండి డబ్బులు తీసుకోవటం. అది తను అడగడు. నాన్న స్వయంగా ఇవ్వడు. ఏం జరగాలన్నా అంతా అమ్మ చేతిమీదుగా జరగాల్సిందే. ఆవిడే ఫీజులకీ, పుస్తకాలకీ ఇస్తుంది. ఎప్పుడన్నా బల్లమీద కూర్చుని తన చేతుల్తో పూర్ణయ్యగారి దగ్గరనుంచి తెచ్చిన డబ్బులు లెక్కపెట్టి ముందు తులసమ్మ చేతిలోనే పెట్టేవాడు.

అసలు డబ్బులు దాచుకోవటానికి ఆయన చొక్కానే తొడుక్కోడు. అలా అని మొలకి చుట్టుకోవటమూ ఉండదు. ఏ చుట్టో, బీడీనో తాగే అలవాటుంటే డబ్బులు అవసరం అయ్యేవి. ఆయనకు ఆ అలవాటూ లేదు. అప్పటికే ప్రవేశించిన హోటల్ సంస్కృతికీ ఆయన లోబడలేదు.

అసలు ఆ ఊరిలో అప్పుడు వెలసిన హోటల్ పేర్లు కూడా సాంబయ్యకి చాలా అనుమానాలు కలిగించాయి. ఒకదానిమీద 'బ్రాహ్మణ కాఫీ హోటల్' అని ఉండేది.

ఇంకోదానిమీద 'కమ్మవారి పదార్థములు శుచిగా, శుభ్రంగా చేయబడును.' అని రెండింటిమీదా రాసుండేది.

తనయితే ఎప్పుడూ ఏ హోటల్స్‌కి వెళ్ళలేదు. ఎప్పుడన్నా రోడ్డుపక్కన అమ్మే బజ్జీలు కొనుక్కుతిన్నాడేమో. అయితే ఆయా హోటళ్ళకి ఆ కులాలవారు మాత్రమే వెళ్ళాలా లేక ఇతర కులాలవారు వెళ్ళవచ్చా అనే అనుమానం పీడించేది. బడికి వెళ్ళేదారినిండా ఇవే చర్చలు.

"ఎందుకురా అలా పెట్టారు? ఆహోటల్‌కి మనం వెళ్ళోచ్చా?" అని అడిగాడు సాంబయ్య తన మిత్రుల్ని.

"ఎందుకు వెళ్ళకూడదు. డబ్బులుండాలేగాని ఎక్కడికైనా వెళ్ళోచ్చు" అని చెప్పారు.

అంతేకాదు, వారందరూ కొత్త ఊర్లో ఇంకో విశేషం చూపించారు. అక్కడో బావి వుంది. దానికి ఇనుప గొలుసూ దానికి కట్టిన బక్కెట్ ఉంది. దాహమయినవారు ఆ బావిలో నీళ్ళు తోడుకుని తాగవచ్చు. అందరూ తాగాక ఓ మూలన రాసున్న మాటలు చూపించాడు.

'కాపు, తెలగ, బలిజె కులస్థులకోసం' అని రాసుంది.

"ఇప్పుడెట్లా? ఎవరైనా ఏమైనా అంటారేమో" అన్నాడు సాంబయ్య భయంగా.

"ఎవరూ ఏమీ అనరు. అలా రాస్తారంతే"

"అలా ఎందుకు రాయటం? ఎవరైనా మంచినీళ్ళు తాగొచ్చుగా."

"తాగొచ్చు. 'బ్రాహ్మణ హోటల్' అని రాస్తే అక్కడ పదార్థాలు శుభ్రంగా ఉంటాయని అర్థం. అంతేగానీ ఇంకెవరూ రాకూడదని కాదు."

"అంటే వాళ్ళే శుభ్రంగా ఉంటారనా?"

"అదికాదులేరా బ్రాహ్మలు ఇంకోచోట అసలు భోంచేయరు. అక్కడ వంటలు చేసేది బ్రాహ్మలు. అందుకే అలా రాస్తారు."

ఈ రకమైన చర్చలు చాలా జరుగుతుండేవి.

ఓసారి ఓ స్నేహితుడు చెప్పాడు.

"మీ నాన్న మాలాళ్ళతో కూడా కూచుని భోంచేస్తాడంటగా."

"ఎక్కడ?" అన్నాడు సాంబయ్య.

"ఏమో ఎవరో అనుకుంటుంటే నేను విన్నా" అన్నాడు.

అప్పుడే సాంబయ్యకు అనుమానం వచ్చింది. తనకి అంతవరకూ కొన్ని కులాలు కూడా తెలియదు. అందులోనూ తమ ఇంటిదగ్గర పనిచేసేవాళ్ళని 'బుడ్డాడు' అంటారని తెలుసు. తను భీముడ్ని 'భీముడూ' అని పిలుస్తాడు తప్పించి "బుడ్డాడు" అని ఎప్పుడూ అనలేదు. అసలు భీముడిది ఏ కులమో కూడా తెలియదు. తమ ఊర్లో అన్ని కులాలవారూ

పనిచేస్తారు. అందులో కొందరు ప్రత్యేకంగా వ్యాపారాలు చేస్తూంటారు. తమకు తెలిసిన కొందరు కొంతకాలంపాటు కుండల వ్యాపారం చేసేవారు. ఆ బేరం బాగున్నప్పుడు జల్సాగానే కనిపించేవారు. ఆ తర్వాతికాలంలో తిరిగి ఎవరో ఒకరి దగ్గర పనులకి చేరిపోతుండేవారు.

తమ ఇంట్లో పనిచేసేదెవరైనా వాళ్ళూ తమ నాన్నా ఒకేసారి అన్నం తింటారు. అందులో ఇంతవరకూ తనకు ఎలాంటి తప్పు కనిపించలేదు. అయితే ఆ తర్వాతి కాలంలో సాంబయ్య పరిశీలనలో ఎన్నెన్నో విషయాలు అర్థమవుతూ వచ్చాయి.

ఆ గ్రామంలో డబ్బున్నవారు చాలామంది ఉన్నారు. అందరి తీరూ ఒకేరకంగా ఉండేది కాదు. అయితే అందరిలోనూ ఏదో పోలిక మాత్రం కనిపించేది. వారందరూ తమకు డబ్బుందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకునే వారిలా కనిపించేవారు. ఎంత పెద్దవయసు ఉన్నవారినైనా 'ఒరేయ్' అంటూ పిలుస్తారు. వారి మాటల్లో అభినయం, అతిశయం ఉంటుంది.

వారు మనుషులతో హృదయం విప్పి మాట్లాడుతున్నట్లు కనిపించేదికాదు. వారి చూపులు కూడా తమాషాగా ఉండేవి. అందులో ఆడవాళ్ళు కూడా ఏం తీసిపోరు. పట్టిపట్టి చూసే చూపుల్లో తమ బట్టలూ, తమ హోదా వగైరాలను నిశితంగా అంచనా వేసుకుంటున్నట్లుగా కనిపించేది.

మామూలు జనం అంటే ఎటూ లెక్కలేదు. అయితే తమ కులంవారిపట్ల కూడా వారు అభిమానం చూపించేవారు కాదు. కాకపోతే మిగతావారిమీద కొంత నయం. అంతకు మించి బాగా డబ్బున్నవారు ఏం పనిచేసినా మిగతావారు భయం భయంగా చెవులు కొరుక్కునేవారు. చివరిమాట మాత్రం

"ఆల్లకి డబ్బుంది. ఏం చేసినా చెల్లుద్ది" అనుకునేవారు.

అలాంటి లక్షణాలు సాంబయ్యకు నచ్చేవికాదు. తనకు నచ్చని లక్షణాలు తన అమ్మలోనూ, నాన్నలోనూ ఉన్నాయా అంటూ వెదికి చూసుకునేవాడు.

తన నాన్నలో తనకు నచ్చని లక్షణాలు కొన్ని ఉన్నాయి.

ముఖ్యంగా ఆయన తనతో గాఢంగా మెలగాలని సాంబయ్య ఆశించాడు. అదెందువల్లనో సాధ్యంకాలేకపోయింది. అసలు తన బిడ్డ గురించి ఇతరులముందు చెప్పటానికే ఆయన సిగ్గుపడినట్లు కనిపించేవాడు.

"ఆడిదేవుంది. కుర్రసన్నాసి" అంటుండేవాడు.

ఒక్కోసారి ఆ మాటకి కోపం వచ్చేది. ఏమిటీయన తనని గుర్తించటంలేదని. భూషయ్యగారికి గుర్తింపు అనేది ఓ సమస్య కానేకాదు. తనలోని లక్షణాలని ఇతరులు గుర్తించాలని ఆయనెప్పుడూ తాపత్రయపడలేదు. అలాగే ఇతరులకు చెందిన విషయంలోనూ అంతే.

అంతకుమించి ఆయనలో ఇంకో ప్రత్యేక అంశం. ఇతరులకూ, తమవారికీ నడుమ ఎలాంటి బేధం చూడకపోవటం. ఆ బేధమేదో ఉండనే ఉంది. సాంబయ్య తన కొడుకు. తులసమ్మ తన భార్య. అంతే అంతకుమించి వారికి గొప్ప ప్రాముఖ్యం ఇవ్వాలని ఆయనకు తెలియదు. మరో విషయం పట్ల తులసమ్మ ఏం భావించేదోగాని సాంబయ్యకి మాత్రం కొంచెం బాధగా ఉండేది.

తోటి పిల్లలయితే వాళ్ళు నాన్నల్తో ఎంతో చనువుగా ఉంటారు. ఆడుకుంటారు. వారితో దెబ్బలు తింటారు. తిట్లు తింటారు. ఇంకా ఏమేమో చేస్తారు. అలాంటివేమీ తనకు ఉండవు.

మార్కులొచ్చినా సంతోషం లేదు. మార్కులు రాకపోయినా దిగులు లేదు. బడికి వెళ్ళినా, వెళ్ళకపోయినా కూడా తనే మాత్రం పట్టించుకోడు. అంతకుమించి సాంబయ్యకు ఆశ్చర్యం కలిగించిన సంఘటన ఒకతి ఎప్పటికీ గుర్తు.

సాంబయ్యకోసారి టైఫాయిడ్ వచ్చింది. దాదాపు నెలరోజులపాటు తనని నానా ఇబ్బందులకి గురిచేసింది. ఈ నెలరోజులూ తనతోపాటు ఉండి తనను గుండెల్లో దాచుకుంది అమ్మ. అయితే తన జబ్బు విషయంలో ఆయన మాత్రం చాలా తాపీగా ఉన్నట్లు కనిపించాడు. సాంబయ్యకు చాలా కోపం కూడా వచ్చింది.

నాకింత జ్వరం కాస్తే నాన్నకు పట్టడంలేదని. అంటే ఏం చేయాలని కూడా ఆ తర్వాత అనుకున్నాడు. ఆ తర్వాత భూషయ్యగారు అర్థం అయ్యాడు. అసలు ఎలాంటి పరిస్థితులకూ ఆయన తొణకడు. ప్రేమా, బాధ ఆందోళన అన్నింటినీ ఆయన కడుపులోనే దాచుకుంటాడు. తను జబ్బు పడ్డ రోజులన్నింటా ఆయన రోజువారీ కార్యక్రమంలో ఎలాంటి మార్పులేదు. ఏ రాత్రిపూటో అడుగుతుండేవాడు.

"ఆడికి ఎట్టా ఉంది?" అని.

"అట్టాగే ఉంది" అనేది తులసమ్మ.

"తగ్గిపోతదిలే" అనేవాడు.

ఆ తర్వాత మంచం వాల్చుకుని చుక్కల్ని చూస్తూ పడుకునేవాడు.

సాంబయ్య దృష్టిలో తండ్రీకొడుకుల సంబంధాలు ఇంత 'డ్రై'గా ఉండకూడదు. తనకు ఊహ తెలిసేటప్పటికే తన తాతలేు. వాళ్ళిద్దరూ ఎలా ఉండేవారా అనే ఆలోచన పీకుతూ ఉండేది. ఏది ఏమైనా తన తండ్రిది ఓ ప్రత్యేకమైన పద్ధతి. అందుకే ఊర్లో చాలా మంది ఆయన గురించి రకరకాల మాటల్తో కాలక్షేపం చేస్తారు. ఆ విషయాలన్నీ ఆయనకు తెలుసా? తెలిసినా తన పద్ధతులు మార్చుకోడా అనేది ఆ తర్వాతి కాలంలో ఓ సమస్యగా అనిపించలేదు సాంబయ్యకి.

తను చదువుకోవాలని ఆరాటపడిన అమ్మే ఎప్పుడూ గుర్తుకు వచ్చేది. తనకు అర్థమైన విషయం ఒకటే. అమ్మకు తను నాన్నలా మారటం మాత్రం ఇష్టంలేదు. ఆమె నాన్నను ఎంతగా ప్రేమించినా ఆయన పద్ధతుల్ని ఆమోదించలేదనడానికి ఇంతకంటే వేరే నిదర్శనం అవసరంలేదు.

అందుకే కష్టపడి చదవటం తన బాధ్యత అనుకున్నాడు. అలాంటి క్రమంలో ఓ మొండి పట్టుదల కూడా సాంబయ్యలో ప్రవేశించింది.

తమ ఊర్లో కొందరు మోతుబరుల ప్రవర్తన ఏమాత్రం తనకి నచ్చలేదు. వారి ప్రవర్తనలో మానవ సంబంధమైన లక్షణాలు కనిపించేవికాదు. మనుషులై ఉండి వీళ్ళంతా మనుషుల ప్రవర్తనకు దూరంగా ఎలా వెళ్ళగలిగారా అనే సందేహం కలిగింది అనేకసార్లు.

ఊరు ఊరంతా కదిలిపోయిన సంఘటన ఒకటి జరిగింది.

ఓ మోతుబరిగారింట్లో పనిచేసే ఓ వ్యక్తిని గుంజకు తాళ్ళతో కట్టి దారుణంగా కొట్టడం. ఆ దృశ్యం సాంబయ్య స్వయంగా చూశాడు.

ఎందుకలా కొడుతున్నారు? అంత లావు తాళ్ళతో బాదుతుంటే ఎలా భరిస్తున్నాడు? అలా నోటినిండా రక్తం స్రవిస్తుంటే చూడటానికి భయం కలగటం లేదా? జాలి కలగటంలేదా? వాలిపోయిన తలను జుట్టు పట్టుకుని పైకి లేపటం ఏమిటి? ముఖాన ఉయ్యటం ఏమిటి?

వాళ్ళందరూ చేతులు కట్టుకుని నిలబడటం ఏమిటి?

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS